క్లుప్తంగా

అధ్వాన పారిశుధ్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం



తిమ్మరాజుపేట పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: మండలంలోని **తిమ్మరాజుపేట** పంచాయతీ కార్యదర్శి వెంకటే**ష్‌పై ఎమ్మెల్యే** సుందరపు విజయకుమార్ ఆ**గ్రహం వ్యక్తం** చేశారు. ఆయన సోమవారం **తిమ్మరాజుపేట** పంచాయతీలో పర్యటించారు. **గ్రామంలో** పారిశుధ్యం అధ్వానంగా ఉండ**డంతో కార్యద**ర్శిపై మండిపడ్డారు. ఒక వై**పు గ్రామాల్లో** స్వచ్ఛత హీ సేవా కార్యక్రమా**లు చేపడుతుం**టే.. అధికారులకు పట్టదా? అం**టూ మండలిం**చారు. గ్రామ కంఠం స్థలా**లు ఆక్రమణకు** గురవుతున్నా పట్టించుకోకపోవ**డంపై ఆయన** అసహనం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని గీత కార్మికుల వినతి



ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న గీత కార్మికులు

పాయకరావుపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కల్లు గీత సంఘాల నాయకులు సోమవారం సీఐ జి.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాలకు చెందిన 23 కల్లు గీత సంఘాల నాయకులు కలిసి పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావును కలిశారు. చెట్ల పైనుంచి పడిపోయి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని, గీత కార్మికుల సంఘాల ఎన్నికలు జరిపించాలని, గుర్తింపు పొందిన గీత కార్మికులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, తదితర సమస్యలను సీఐ దృష్టికి తీసుకెళ్లారు.

టీచర్ అప్పలనాయుడికి సత్కారం



అప్పలనాయుడిని సత్కరిస్తున్న పీఆర్‌టీయూ మండల నాయకులు

ఎస్.రాయవరం: ఇటీవల పీఆర్‌టీయూ నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించిన ధర్మవరం అగ్రహారం బయాలజీ ఉపాధ్యాయుడు ఆర్.అప్పలనాయుడును సోమవారం యూనియన్ మండల కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కమిటీ ఆధ్వర్యంలో ధర్మవరం అగ్రహారం ఉన్నత పాఠశాలలో ఆయనకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్ ప్రకాష్, ఉపాధ్యాయురాలు లలితాంబ, తదితరులు పాల్గొన్నారు.

అపరాలపై వర్షాభావ ప్రభావం



అపరాల పైరుకు క్రిమి సంహారక మందు పిచికారీ చేస్తున్న రైతు

ఎస్.రాయవరం: మండలంలో అపరాల సాగుకు అనుకూల వాతావణం లేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గడిచిన 20 రోజులుగా వర్షాభావం కారణంగా మొలకెత్తిన అపరాలు చాలా వరకు చనిపోయాయని చెబుతున్నారు. ఈ ఏడాది 6 వేల ఎకరాల్లో అపరాలు సాగు చేపట్టగా.. 60 శాతం పంట దెబ్బతిన్నాదని అంటున్నారు. దీనికి తోడు తెగులు సమస్య పీడిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో క్రిమి సంహారక మందులు పిచికారీ చేసే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు.

మద్యం విక్రేత అరెస్టు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామ శివారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకుని, 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు అనకాపల్లి ఎక్సైజ్ సీఐ వైఎల్ నాయుడు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పిల్లి తలుపులును అరెస్టు చేసి ఎక్సైజ్ కోర్టులో హాజరు పర్చామన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు తమకు అందిన సమాచారంపై ఈ దాడి చేశామన్నారు.



పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా కొలతలు తీస్తున్న సిబ్బంది



పూడిమడక రోడ్డులో వాహనాల రద్దీ దృశ్యం

విస్తరణలో జాప్యం.. ప్రమాదాలకు నిలయం

- పూడిమడక రోడ్డులో తరచూ ప్రమాదాలు
- ఇరుకు రోడ్డుతో వాహనచోదకుల అవస్థలు
- దూసుకొస్తున్న భారీ వాహనాలతో బెంబేలు

మునగపాక: పూడిమడక రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. అసలే ఇరుకు రోడ్డు.. ఆపై నిత్యం భారీ వాహనాల రాకపోకలు బెంబేలెత్తిస్తున్నాయి. రహదారి విస్తరణలో జాప్యం జరగడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు 14 కిలోమీటర్ల మేర పూడిమడక రోడ్డు ఉంది. రోడ్డు విస్తరణకు రూ.347 కోట్లను కేటాయించారు. బాధితులకు రూ.106.98 కోట్లు, రోడ్డు నిర్మాణానికి రూ.240 కోట్లు కేటాయించారు. **జగ్గయ్యపేట అగ్రహారం, నాగులాపల్లి, ఒంపోలు, గంగాదేవిపేట, మునగపాక, తిమ్మరాజుపేట, అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట, హరిపాలెం, కొండకర్ల, చోడపల్లి తదితర రెవెన్యూ** గ్రామాలు ఈ రోడ్డును ఆనుకొని ఉన్నాయి. ఈ రహదారి ప్రస్తుతం 20 నుంచి 25 అడుగుల వెడల్పు మించి లేదు. ఈ రహదారిపై ప్రస్తుతం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అచ్యుతాపురంలోని బ్రాండెక్స్‌కు నిత్యం వందలాది మంది వాహనాలపై ప్రయాణం అలాగే అనకాపల్లి, విశాఖ తదితర ప్రాంతాల్లో చదువుకునే వారితో పాటు ఉద్యోగ, వ్యాపారాలు చేసేవారితో ఈ రోడ్డుపై తిరిగే వాహనాల సంఖ్య గణనీయంగానే ఉంటోంది. దీనికి తోడు భారీ వాహనాల రాకపోకలు కూడా ఎక్కువగా ఉంటున్నాయి.

విస్తరణ బాధితుల గుర్తింపు పూర్తి

పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి ఇప్పటికే బాధితుల గుర్తింపు, ఎంత మేర గృహాలు దెబ్బతింటున్నాయి.. ఎంత మేర వ్యవసాయ భూములు నష్టపోతున్నాయనే వివరాలను సేకరించారు. **ఆ మేరకు మార్కింగ్ పనులు కూడా పూర్తి చేశారు. దీనికి తోడు రెవెన్యూ గ్రామాల వారీగా ప్రభుత్వం నుంచి అందించే సాయాలకు సంబంధించి గ్రామసభలు నిర్వహించారు. మునగపాక** రెవెన్యూకు సంబంధించి కొంత మంది రైతులు మాత్రం తమకు పరిహారం మరింత పెంచాలంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే మెజార్టీ బాధితులంతా విస్తరణకు సానుకూలంగా ఉన్నారు.

విస్తరణతోనే ప్రమాదాల నివారణ

పూడిమడక రోడ్డు విస్తరణ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు చెబుతున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయనే వాదన వినిపిస్తుంది. రాత్రి సమయంలో భారీ వాహనాలు అధిక లోడుతో రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ తక్షణ అవసరం



పూడిమడక రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఉంది. నిత్యం అధిక సంఖ్యలో ఈ రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇరుకు రోడ్డు కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు భారీ వాహనాలు అధిక లోడుతో వస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రహదారి విస్తరణ చేపట్టాలి.

– మళ్ల వేణు, ద్విచక్ర వాహనదారుడు, మునగపాక

ప్రకటనలతో సరిపెడుతున్నారు..



పూడిమడక రోడ్డు విస్తరణ చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారు. ఇంత వరకు ఎటువంటి పనులు చేపట్టలేదు. బాధితుల గుర్తింపు జరిగినా రోడ్డు విస్తరణ పనుల్లో కదలిక కనిపించక పోవడం దారుణం. ప్రభుత్వం స్పందించి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలి.

– వీవీ శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా కోశాధికారి

విస్తరణకు త్వరలో చర్యలు



పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి త్వరలో చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రహదారి విస్తరణ బాధితులను గుర్తించాం. చట్ట ప్రకారం అర్హులందరికీ మెరుగైన పరిహారం అందించేలా కృషి చేస్తున్నాం. పలు మార్లు రెవెన్యూల వారీగా అధికారులు గ్రామసభలు నిర్వహించారు. విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. పూడిమడక రోడ్డు విస్తరణ ద్వారా ఈ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయి.

– సుందరపు విజయకుమార్, ఎమ్మెల్యే, యలమంచిలి

నెల్లిపూడిలో కమ్యూనిటీ రచ్చబండ



రచ్చబండను ప్రారంభిస్తున్న సర్పంచ్ సురేష్, తదితరులు

నక్కపల్లి: మండలంలో నెల్లిపూడిలో సర్పంచ్ కె.సురేష్‌వర్మ సొంత నిధులతో కమ్యూనిటీ రచ్చబండను నిర్మించారు. ఈ రచ్చబండను సోమవారం ఆయన పలువురు నాయకులతో కలిసి ప్రారంభించారు. ప్రజలు సమావేశాలు నిర్వహించుకునేందుకు, చిన్న చిన్న తగాదాలు పరిష్కరించుకునేందుకు ఈ రచ్చబండ ఉపయోగపడుతుందని సర్పంచ్ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, వేంపాడు, గొడిచర్ల పీఏసీఎస్‌ల **మాజీ అధ్యక్షులు** అయినంపూడి మణిరాజు, పాడ**గట్ల పాపారావు,** ఎంపీటీసీ తంగేళ్ల కృష్ణ, టీడీపీ **మండల అధ్యక్షు**డు కొప్పిశెట్టి వెంకటేష్, మాజీ **జెడ్పీటీసీ సభ్యు**డు కురందాసు నూకరాజు, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

అజోల్లాతో మెరుగైన పాల దిగుబడులు



మందులు అందిస్తున్న పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

మునగపాక: పశువులకు అజోల్లా వినియోగించడం **వల్ల మెరుగైన పాల** దిగుబడులు సాధించవచ్చునని **మండల పశువైద్యా**ధికారి లావేటి ప్రదీప్‌కుమార్ తెలి**పారు. మునగపాక**లో సోమవారం నిర్వహించిన పశు **ఆరోగ్య శిబిరంలో** భాగంగా పశువులకు సంబంధించి**న మందులు అందజే**శారు. ఈ సందర్భంగా ఆయన **మాట్లాడుతూ అజో**ల్లా వల్ల వెన్న శాతం కూడా పెరిగి, మంచి ఆదాయం లభిస్తుందన్నారు. మేలు జాతి పశువుల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. పశువులకు సకాలంలో టీకాలు వేసుకోవాలన్నారు. నట్టల నివారణ మందులను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాడి ముసిలినాయుడు, వేగి కృష్ణ, ముసిలితల్లి మూల సంఘం అధ్యక్షుడు పాలమరశెట్టి అప్పలనాయుడు, మారిశెట్టి అప్పలనాయుడు, ఆడారి గంగునాయుడు, వెలగా దుర్గునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



జానకయ్యపేటలో పాడి రైతులకు మందులు అందిస్తున్న డాక్టర్ వీర్రాజు

నక్కపల్లి: మండలంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.వీర్రాజు కోరారు. సోమవారం ఆయన మండలంలో దేవవరం, జానకయ్యపేట, ఒడ్డిమెట్ట తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ వ్యాధులతో బాధపడుతున్న పశువులు, మేకలు, కోళ్లకు టీకాలు వేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లలో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే సమీపంలో ఉన్న పశువుల ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాలన్నారు. పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ వరకు నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఈ శిబిరాలు నిర్వహించనున్నామని వీర్రాజు తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

మునగపాక: మండలంలో పలు ప్రాంతాల్లో మంగళవారం నుంచి ఈ నెల 24 వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. 6 సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ నమోదుతో పాటు బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. మంగళవారం ఉమ్మలాడ, పల్లపు ఆనందపురం సచివాలయాల్లోనూ, 22న రాజుపేట, మెలిపాక సచివాలయాల్లో, 23న తోటాడ, గంటవానిపాలెం, నాగులాపల్లి–1 సచివాలయాల్లోనూ, 24న పాటిపల్లి, మునగపాక–2, నాగులాపల్లి సచివాలయాల్లో ఆధార్ నమోదు జరుగుతుందన్నారు.

వైభవంగా సీతారాముల తీర్థం



కైలాసపట్నంలో ముగ్గులను పరిశీలిస్తున్న గ్రామ పెద్దలు



కాకరాపల్లిలో తోడ పెద్దును పూజిస్తున్న భక్తులు

కోటవురట్ల: కైలాసపట్నంలో శ్రీసీతారాముల తీర్థం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రామాలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. అనంతరం జరిగిన తీర్థంలో సమీప గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన జనం సందడి చేశారు. రంగవల్లికల పోటీలో మహిళలు పోటీపడ్డారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, గోవాడ గెడ్డ కమిటీ చైర్మన్ డి.వి.రావు, డీవీ యువసేన అధ్యక్షుడు చామంతుల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని కాకరాపల్లిలో సోమవారం సీతారాముల తీర్థం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సీతారాములను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తీర్థంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తోడపెద్దుకు ప్రత్యేక పూజలు చేశారు.

పాములవాకలో నేడు తీర్థం


కోటవురట్ల: పాములవాక గ్రామంలోని రామాలయం వద్ద గణపతి, సీతారామ లక్ష్మణ, ఆంజనేయ, షిర్డీ సాయిబాబా తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్టు మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. హరిభజన, కోలాటం, ముగ్గుల పోటీలు ఉంటాయని, భక్తులు హాజరై తీర్థ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్లస్ 2 కళాశాల కొనసాగేలా చూడండి

ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌కు టీచర్ల వినతి

యలమంచిలి రూరల్: యలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్లస్ 2 కళాశాల కొనసాగేలా చర్యలు తీసుకోవాలని టీచర్లు స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌కు విన్నవించారు. సోమవారం పట్టణంలోని తులసీనగర్ జిల్లా పరిషత్ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినుల తరగతి గదులకు వెళ్లిన ఎమ్మెల్యే వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులంతా నైతిక విలువలతో కూడిన విద్యను నేర్చుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలుగుతారన్నారు. విద్యార్థినులతో ఎమ్మెల్యే మాట్లాడుతున్న సమయంలో తరగతి గదుల తలుపులు మూసివేసి టీచర్లెవ్వరినీ లోపలికి అనుమతించలేదు. అనంతరం టీచర్లంతా ఇక్కడ ప్లస్ 2 కళాశాలను ప్రభుత్వం రద్దు చేయకుండా చూడాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు.

ప్రతి ఒక్కరికీ దైవ చింతన అవసరం



విజయ్, స్వాతి దంపతులను సత్కరిస్తున్న రామాలయం కమిటీ సభ్యులు

మునగపాక: ప్రతి ఒక్కరికీ దైవ చింతన అవసరమని వ్యాపారవేత్త పెంటకోట విజయ్ అన్నారు. మునగపాకలోని గౌరీపరమేశ్వరుల ఆలయంలో రాముల వారికి ధనుర్మాసంలో భాగంగా ఇత్తడి సామగ్రి అందజేసిన పెంటకోట విజయ్, స్వాతి దంపతులను సోమవారం రాత్రి కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ప్రతి రోజు కొంత సమయం దేవాలయంలో గడపాలన్నారు. దేవస్థాన కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, గౌరవ అధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు 'హైందవ శంఖారావం' ప్రతినిధుల సమావేశం

ముడుగుల రూరల్ : ఈ నెల 5వ తేదీన విజయవాడలో జరిగిన హైందవ శంఖారావం బహిరంగ సభకు హిందూ బంధువులను అధిక సంఖ్యలో తరలించడంలో ముఖ్యపాత్ర పోషించిన 25 మంది బస్సు ప్రముఖులు, ఖండ కన్వీనర్, సహ కన్వీనర్ సభ్యులతో మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు కేజీపురం జంక్షన్‌లోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్య బాధ్యులంతా తప్పక హాజరు కావాలని రాపేటి కొండలరావు, మాడుగుల ఖండ కన్వీనర్ ఉండూరు శ్రీనివాసరావు, సహ కన్వీనర్, సభ్యులు సత్యారావు. శివాజీరాజు కోరారు.

ఉపమాక ఆలయంలో గ్రానైట్ మెరుపులు



ఉపమాక ఆలయంలో గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు జరుగుతున్న దృశ్యం



బేడా మండపం చుట్టూ పూర్తయిన గ్రానైట్ ఫ్లోరింగ్

- రూ.30 లక్షలతో ఫ్లోరింగ్ పనుల ప్రారంభం
- నిధులు మంజూరు చేసిన టీటీడీ

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం, టీటీడీ అనుబంధ దేవాలయం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. టీటీడీ మంజూరు చేసిన రూ.30 లక్షల నిధులతో కొద్ది రోజుల క్రితం ప్రారంభమైన ఈ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులు, క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి గర్భగుడి, బేడా మండపం, ఆస్థాన మండపం చుట్టూ గ్రానైట్ ఫ్లోరింగ్ వేస్తున్నారు. భక్తులు ప్రదక్షిణ చేసే నాలుగు దిక్కులూ గ్రానైట్ పలకలు అమర్చే పనులు జరుగుతున్నాయి. ఆలయ ప్రాకారం, బేడా మండపం చుట్టూ గ్రానైట్ పనులు పూర్తయ్యాయి. గర్భాలయం చుట్టూ పలకలు వేసే పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి.

బేడా మండపం ప్రాంగణంలో గతంలో రాతి పలకలు ఉండేవి. వాటిని తొలగించి ఈ గ్రానైట్ పలకలు వేస్తున్నారు. రానున్న రోజుల్లో భక్తుల సౌకర్యార్థం టీటీడీ ఇక్కడ ఆలయంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది. ముఖ్యంగా కొండపై మూల విరాట్‌ను దర్శించుకునేందుకు మెట్ల మార్గంలో వెళ్లే భక్తుల కోసం మధ్యలో బాలాలయం నిర్మించే ఆలోచన ఉంది. తిరుమలలో మాదిరిగా స్వామివారి నిలువెత్తు రూపంతో ఉన్న బాలాలయాన్ని నిర్మించే ప్రతిపాదన గతంలో టీటీడీ చేసింది. ఈ బాలాలయాన్ని త్వరగా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. కాటేజీలు, కొండపైకి రోడ్డు సదుపాయం, కల్యాణ మండపాలు, మెయిన్ రోడ్డు విస్తరణ, ప్రసాదాల విక్రయాలు, కౌంటర్లు, మెట్ల మార్గాన్ని ఆధునీకీకరించడం, విద్యుత్ లైటింగ్, భక్తుల కోసం మరుగుదొడ్లు, తాగునీరు, వాడుకనీటి సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించాల్సి ఉంది. ఆలయాన్ని దత్తత తీసుకునే సమయంలో ఈ అభివృద్ధి పనులన్నీ చేస్తామని అప్పట్లో టీటీటీ అధికారులు హామీ ఇచ్చారు. స్వామివారి పుష్కరిణిని శుభ్రం చేయించడం, రక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. ఉపమాక నుంచి జాతీయ రహదారి వరకు 80 అడుగుల డబుల్ రోడ్డు కూడా నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేకంగా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వచ్చే మార్చిలో జరిగే కల్యాణోత్సవాల నాటికి టీటీడీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని భక్తులు కోరుతున్నారు.

గుళ్లాట ఆడిస్తున్న ఇద్దరిపై కేసు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో గుళ్లాట ఆడిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ అల్లు స్వామినాయుడు సోమవారం తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు గుళ్లాట స్థావరంపై దాడి చేసి 6 గుళ్లు, నెంబర్ పట్టా, రూ.1,550 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్‌ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది దాడులు చేశారన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రీ-సర్వేతో రైతులకు మేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: రీ-సర్వే ద్వారా రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. మండలంలోని నరేంద్రపురంలో సోమవారం నిర్వహించిన రీ-సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతుల భూములకు సంబంధించి ఎటువంటి తేడాలు లేకుండా ఉండేలా రీ-సర్వే అందుబాటులోకి వచ్చిందన్నారు. గతంలో జరిగిన తేడాలను సవరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు బోజా లక్ష్మి, సర్పంచ్ సత్యవతి, ఉప సర్పంచ్ బోజా శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, రీ-సర్వే డీటీ పడాల్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంటింటా ఆరోగ్య పింఛన్ల తనిఖీలు



దేవరాపల్లిలో వృద్ధుడిని పరిశీలిస్తున్న పింఛన్ల తనిఖీ వైద్య బృందం

దేవరాపల్లి : మండల వ్యాప్తంగా వైద్యుల బృందం పింఛన్ల తనిఖీ ప్రక్రియను సోమవారం చేపట్టారు. గ్రామాల్లో ఆరోగ్య పింఛన్లు పొందుతున్న వారి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని, ధ్రువపత్రాలు, అర్హతను క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలోని 27 పంచాయితీల పరిధిలో దీర్ఘకాలిక, తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన 74 మంది పింఛను దార్లకు సంబంధించి మండలానికి వచ్చిన నాలుగు వైద్య బృందాలు వేర్వేరుగా తనిఖీలు చేపట్టారు. ఈ బృందంలో ఆర్థోపెడిషియన్, జనరల్ మెడిసిన్ వైద్యులతో పాటు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి, వైద్య సిబ్బంది ఉన్నారు. వైద్యులు ఇంటింటా పర్యటించి తనిఖీలు చేపడుతుండడంతో ఎవరి పింఛన్లు తొలగిస్తారోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పింఛన్ల తనిఖీ ప్రక్రియలో దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఈ.పూజ్య మేఘన, బి. రవితేజ పాల్గొన్నారు.